# ప్రాధాన్యతా క్రమం



*సాలోక ఏవ సూర్యే*
*గృహిణీ గృహస్వామినో గృహీత్వా*
*అనిచ్ఛన్నపి పాదౌ*
*ధావయతి హసతీ హసతః*

***భావం:*** సూర్యుని వెలుతురు ఉండగానే ఇష్టంలేకపోయినప్పటికీ నవ్వుతున్న గృహ యజమాని పాదాలను పట్టుకుని గృహిణి నవ్వుతూ కడుగుతున్నది.

వివాహంకోసం వరుడికై ప్రయత్నాలు జరుగుతున్నప్పుడు కన్య అందమైన వరుడు కావాలనుకుంటుంది. ఆమె తల్లి ధనముండాలనుకుంటుంది. తండ్రి చదువు చూస్తాడు. బంధువులు

సంప్రదాయం పరీక్షిస్తారు. మిగతా వాళ్ళకేముంది పెళ్ళిభోజనం బావుంటే చాలనుకుంటారు.

అన్నీ బావున్న సంబంధం దొరకడం చాలా కష్టం. అదృష్టవశాత్తూ నీరజాక్షికి అటువంటి వరుడు దొరికాడు. అందగాడు, భూములు బాగా ఉన్నాయి. రాజాస్థానంలో ఉద్యోగి. ఇంకేముంది. జీవితం స్వర్గమే అనుకుంది. వివాహమయ్యేక ఆమెకు కన్నకలలకీ, ఉన్న జీవితానికీ పోలిక లేదని తెలిసింది. భర్త ఉదయానే భూముల తనిఖీకి వెడతాడు. పొలంలో పనుల అజమాయిషీ పూర్తయ్యాక ఇంటికి వచ్చి స్నానం, భోజనం పూర్తిచేసుకుని రాజుగారి కొలువుకి వెడతాడు. అక్కడ పని పూర్తయి ఇంటికి చేరడం అర్ధరాత్రికే. ఆమెకు సమయం భారంగా గడవసాగింది. తన కష్టం ఎవరికీ అర్థంకాదనీ ఆమెకు తెలుసు. ఎవరికైనా చెప్తే "నీ భర్తతాగుబోతా, తిరుగుబోతా? తిన్నది అరక్క గోరంతలు కొండంతలు చేస్తున్నావు." అని తిట్టగలరు. ఒంటరితనంలో కష్టం ఎవరికి తెలుస్తుంది?

ఒకరోజు  నీరజాక్షి భర్త రాజపత్రమొక్కటి ఇంట్లో మర్చిపోయి ఆస్థానానికి వెళ్ళిపోయాడు. సాయంకాలం ఆ పత్రం అవసరమై, సూర్యాస్తమయానికి ముందే ఇంటికి వచ్చాడు. భర్త తొందరగా ఇంటికి రావడం ఆమెకెంతో ఆనందాన్నిచ్చింది. అంతలోనే మళ్ళీ వెళ్ళిపోతాడేమోనని అనుమానమూ వచ్చింది. వెంటనే ఆమె నీళ్ళు తీసుకుని వచ్చి అతని పాదాలు కడిగింది. ( పూర్వకాలం కాళ్ళు కడుక్కున్నాక ఇల్లు కదిలి వెళ్ళేవారు కాదు). ఆమె నవ్వుతూ ఆనందంగా పాదాలు కడిగింది అతనికాపని ఇష్టం లేదు. మళ్ళీ వెళ్ళేపోయే ఉద్దేశ్యంతో వచ్చాడు. అతనికి తను చేస్తున్న తప్పు తెలిసింది. ఉద్యోగం ముఖ్యమే కానీ కుటుంబ సౌఖ్యం కూడా ముఖ్యం.

నీరజాక్షి కథ వంటివి ఇప్పుడెన్నో జరుగుతున్నాయి. సైకాలజిస్టులూ, మేనేజిమెంట్ ఎక్స్‌పర్ట్స్ ఈ విషయం గురించే వర్క్‌లైఫ్ బాలన్స్ ఉండాలని చెప్తున్నారు. వర్క్‌లేదా ఉద్యోగం ముఖ్యం. అది జీవనోపాధి, సంఘంలో

గౌరవదాయిని, ఆనందకారిణి. కానీ ఉద్యోగమెంత ముఖ్యమో కుటుంబ జీవనంకూడా అంతే ముఖ్యం. భార్య (లేదా భర్త) నీ, పిల్లలనీ, ఉల్లాస కార్యక్రమాలనీ పూర్తిగా వదిలేసి పనికే అంకితమవడం శారీరకారోగ్యానికీ, మానసికానందానికీ మంచిది కాదు. చాలామంది మరణశయ్యపై "అయ్యో జీవితమంతా పనికే అంకితం చేశాననుకుంటారు. కానీ ఇంకొంచెం పని చేసి ఉండాల్సింది" అని అనుకోరట. నీరజాక్షి కథ నేటి యువతరానికి ఒక హెచ్చరికగా పనికొస్తుంది. ఇప్పటి యువతీ యువకులు పూర్తిగా కెరియర్ ప్లాన్‌లో పడిపోయి జీవితాన్ని పట్టించుకోవడం లేదనిపిస్తుంది. అలాగని ఏ పనీ లేకుండా ఉండాలని చెప్పడం లేదు. సరైన వర్క్‌లైఫ్ బాలన్స్ సాధనే విజ్ఞత.

******